## కథ

**-ఎం. మాధవికృష్ణ**

# తేలు కుట్టిన దొంగ

**ఉదయం పదిన్నర కావస్తోంది. అప్పటివరకు నిశ్శబ్దంగా వున్న బ్యాంకు కస్టమర్స్‌తో నిండిపోసాగింది. ఎంప్లాయీస్ అంతా సర్దుకుని సీట్లల్లో కూర్చుంటున్నారు. అప్పుడు పని మొదలైతే సాయంత్రం వరకు రోజు ఎలా గడిచిపోయిందో తెలీనంత బిజీ అయిపోతారు వాళ్లందరూ.**

**ఆరోజు ఎకౌంటెంట్ బుచ్చిబాబు గుండె లబ్-డబ్ అనే బదులు డబ్-డబ్ అనసాగింది. భద్రంగా ఓసారి గుండె మీద చేత్తో తట్టుకున్నాడు.**

సీట్లోకి వచ్చిన దగ్గర్నుంచీ అతని పరిస్థితి గమనిస్తోంది కొలీగ్ సరళ.

''ఏంటండోయ్... బుచ్చిబాబుగారూ.. టెన్షన్‌గా వున్నారు? ఈరోజు బ్యాంకుకేమన్నా కన్నమేసి లాకర్లోని వజ్రాలు గట్రా పట్టుకుపోయేట్లుగా వుంది పరిస్థితి?'' నవ్వుతూ అడిగింది.

''వజ్రాలా... అబ్బెబ్బే..'' తడబడిపోయాడు.

''ఊరికే జోక్ చేశాలెండి'' ముసిముసి నవ్వులతో తలతిప్పుకుంది.

'దీని సిగతరగ... ఆవులిస్తే పేగులు లెక్కపెట్టేసినట్లు మాట్లాడుతుంది ఎప్పుడూ...' మనసులోనే సరళను తిట్టుకున్నాడు.

ఇంతకీ లోపల భద్రంగా వుంది కదా అంటూ మరోసారి షర్ట్‌జేబు తడుముకున్నాడు.

పుట్టిన ఏ మనిషికైనా సాధారణంగా వుండే కోరిక బుచ్చిబాబుకీ వుంది. తను వున్న స్థాయి కన్నా మరింత మంచి పొజిషన్‌కి ఎదగాలని కార్లల్లో తిరగాలనీ, పెద్ద బంగళాల్లో నివసించాలనీ...

బ్యాంక్ ఎంప్లాయి అయ్యి తిండికి, గుడ్డకి లోటులేకుండా సాధారణ జీవితం గడుపుతున్న బుచ్చిబాబు ఆ కోరికలకు అతీతుడేం కాదు.

ఓరోజు అనుకోకుండా చిన్నప్పటి ఫ్రెండ్.. హోండాసిటీ కారులో కనిపించాడు.

''ఏరా.. డిగ్రీ చదువుకుని చివరికి డ్రైవర్ పని చేస్తున్నావా..?'' మిత్రుడి పరిస్థితికి జాలిపడుతూ అమాయకంగా అడిగాడు.

కారు అద్దాలు భళ్ళున పగిలిపోయేంత శబ్దంతో బిగ్గరగా నవ్వాడతను.

ఆ తర్వాత ఓ కార్డుముక్క బుచ్చిబాబు చేతిలో పెట్టాడు. అక్కడికి వెళ్ళు దశ తిరుగుతుందని చెప్పాడు. ఆ సంస్థే 'అమృతమయి' సంస్థ. వాళ్ళిచ్చిన ఉంగరం వల్లనే తన జీవితం మారిందని, కారు సొంతమని చెప్పాడు.

వెళ్ళేటప్పుడు జాతక వివరాలు మర్చిపోకుండా తీస్కెళ్ళమని చెప్పాడు.

చిన్నప్పట్నించీ బుచ్చిబాబుకి జాతకాల మీద నమ్మకం ఎక్కువే. అప్పుడప్పుడూ పండితుల దగ్గర జాతకాలు చూపించుకోవటం, గ్రహశాంతులు, రెమిడీస్ అంటూ వాళ్లు ఇరవై ఒక్క రోజులు శివాలయం చుట్టూ, మరో మండలం రోజులు వేప, రావి చెట్లు కలిసి వున్న చోట్ల ప్రదక్షిణాలు చెయ్యమని చెప్పటం.. వాటిని తు.చ. తప్పకుండా ఆచరించటం బుచ్చిబాబు అలవాటు.

అటువంటివాడు తన ఫ్రెండ్ పొజిషన్ కళ్ళారా చూశాక 'అమృతమయి'కి వెళ్ళకుండా ఎలా వుంటాడు? తీరా వెళితే జాతకచక్రం, బయోడేటా తీస్కుని ఓ పదిహేనురోజుల తర్వాత కలవమని అపాయింట్‌మెంట్ ఇచ్చారు.

ఆ పదిహేనురోజులూ తను కార్లో తిరగటానికి లేటయిపోయిందని తెగఫీలయ్యాడు బుచ్చిబాబు.

అసలు రోజు రానే వచ్చింది. బుచ్చిబాబుని తీస్కెళ్ళి ఎ.సి.రూమ్‌లో కూర్చోబెట్టారు. రోజ్‌వుడ్ ఫర్నిచర్‌తో ఆఫీసురూమంతా బాగా కాస్ట్లీ లుక్‌తో వుంది.

చూడగానే నమస్కరించాలని బుద్ధి పుట్టించే తేజస్సుతో వున్న జ్యోతిష్కుడు ఒకతను వచ్చి బుచ్చిబాబు ముందుసీట్లో ఆసీనుడయ్యాడు.

డ్రా లోపల్నుంచి బుచ్చిబాబు ఫైల్ బయటికి తీసి చెప్పసాగాడు ఆయన.

''దివ్యమైన జాతకం మీది'' ఆ మొదటి మాటకే బుచ్చిబాబు సంతోషంతో తడిసి ముద్దయ్యాడు.

''పెట్టే చేయ్యేకానీ.. ఒకరి చేతికింద చేయి చాచే జాతకం కాదు'' ఇదీ నిజమే.

''నరదృష్టిబాగా వుంది. చుట్టుపక్కల వాళ్లు.. ఆఫీసులో వాళ్లు మిమ్మల్ని చూసి ఈర్ష్య, అసూయలతో బాధపడతారు'' ఇది కూడా నిజమే. తనని చూసి ఆఫీసులో వాళ్లు కుళ్ళుకుంటున్నట్లు చాలాసార్లు అనిపించేది.

''బాధలో వున్నవాళ్లని చూసి స్పందించే హృదయం మీది. మానవసేవే మాధవసేవ అనుకునే తత్త్వం'' ఈ డైలాగ్ మాత్రం కొద్దిగా మింగుడుపడలేదు బుచ్చిబాబుకి. ఎన్నడైనా పిల్లికి కూడా బిచ్చం పెట్టరు అని సాధించే సుజన గుర్తుకొచ్చింది. ఆ... దాని మొహంలే అంటూ అంతరాత్మని జోకొట్టాడు.

''ఇప్పుడు చెప్పండి. మీ సమస్యలేమిటి? మీ కోరికలేమిటి? మీకు మా సంస్థ ఏ విధంగా హెల్ప్ చేయగలదు?'' అసలు విషయానికొస్తూ అన్నాడు ఆయన.

తన కోరికలేంటో చెప్పాడు బుచ్చిబాబు.

మరొక అయిదు నిమిషాలు కళ్ళుమూస్కుని, వేళ్ళకణుపులు లెక్కిస్తూ, ఆలోచిస్తూ కూర్చున్నాడు ఆయన.

''వజ్రం పెట్టండి'' కళ్ళు తెరుస్తూ అన్నాడు.

''ఉంగరమే కదా..'' అడిగాడు బుచ్చిబాబు.

''అవును. రెండుకేరెట్ల వజ్రం పెడితే.. మీ జాతకానికి దివ్యంగా సరిపోతుంది''

''రెండు కేరెట్లా? ఎంత కావొచ్చు?'' అడిగాడు గంపెడెంత ఆశ కళ్ళల్లో నింపుకుని.

''ఊ... ఓ ఏడు లక్షల పైచిలుకే.. నిఖార్సయిన వజ్రాలు మాదగ్గరే వున్నాయి''

ఏదో సామెత చెప్పినట్లు అంత డబ్బుపెట్టి ఉంగరం కొనే స్థితే తనకుంటే.. తను ఈయన దగ్గరికెందుకొస్తాడు? అదే చెప్పాడు ఆయనకి.

మరో అయిదు నిమిషాలు జాతకచక్రం మరోమారు చూసి కూడికలు, తీసివేతలు చేతివేళ్లతో చేశాడు. ''హీనపక్షం పాతిక సెంట్ల వేల్యుబుల్ డైమండ్ అయినా పెట్టాలి. బంగారంతో కలిపి దాదాపు నలభై వేలు.. అదే చివరి దారి'' అరమోడ్పులైన కళ్ళతో చెప్పాడు.

ఐదేళ్ళక్రితం ఇల్లు కట్టడానికి తీస్కున్న లోన్లే ఇంకా తీరలేదు. బుచ్చిబాబు ఆలోచనలో పడ్డాడు.

''మీ జాతకం మారిపోతుంది. మీరు ఉన్నత స్థానానికొస్తారు. లేకపోతే ఇదే జీవితం.. ఇలాగే కొనసాగుతుంది'' బుచ్చిబాబులో ఓ పక్క ఆశ, మరోపక్క భయం పెంచుతూ చెప్పాడు ఆయన.

అయినా సందిగ్ధత వదల్లేదు అతన్ని.

''సరే.. ఓ పని చెయ్యండి. నేను నాదగ్గర వుండే స్టోన్ పీస్ ప్యాక్ చేసి మీకిస్తాను. ఓ రాత్రి, ఓ పగలు దాన్ని మీదగ్గర అట్టేపెట్టుకోండి.. రాత్రిళ్లు దిండుకింద పెట్టుకుని పడుకోండి. నిద్దట్లో పీడకలలు.. విపరీత పరిణామాలూ వస్తే నా వస్తువు నాకు తెచ్చివ్వండి. అలా కాకుండా మంచి స్వప్నాలు మీ కళ్ళబడితే మర్నాడు వచ్చి డబ్బులు కట్టి మీ సొంతం చేసుకోండి'' చెప్పాడు ఆయన బేరం పోకూడదన్నట్టు.

''నన్ను నమ్మి.. మీరు..?'' అడిగాడు బుచ్చిబాబు.

''మీరు బ్యాంకు వారైనప్పుడు.. ఆ బ్యాంకు మాది కాదా?'' బయోడేటా ఫైల్ చూపిస్తూ నవ్వాడు ఆయన.

అలా.. ఆ రోజంతా బుచ్చిబాబు జేబులో వున్న డైమండ్‌ని తడుముకుంటూనే వున్నాడు, వుంది కదా అనుకుంటూ.

ఆ రాత్రి భోజనాలయ్యాక జేబులో వున్న చిన్న పొట్లాం తీసి తలగడ కింద పెట్టుకుని నిద్రకుప్రకమించాడు.

''సుజనా- రేప్పొద్దున్న నేను నిద్ర లేచే లోపే.. పడుకున్న బెడ్‌షీట్లు.. దుప్పట్లు.. తలగడ కవర్లు అన్నీ ఉతుక్కి వెయ్యకే.. ముఖ్యంగా ఈ దిండుకింద ఇంపార్టెంట్ వస్తువొకటి పెట్టాను'' అని చెప్పాడు భార్యకి.

ఆదివారమొస్తే పదిగంటల వరకూ లేవడని ఎప్పుడైనా యుద్ధప్రాతిపదికన ఇల్లు క్లీన్ చెయ్యటం మొదలుపెట్టి, అతను నిద్రపోతున్నప్పుడే దిండ్లూ, దుప్పట్లూ లాగెయ్యటం సుజనకు అలవాటే.


నిద్రపోతున్న బుచ్చిబాబుకి కలలో పెద్ద, పెద్ద బంగళాలు కనిపిస్తున్నాయి. ఇంటినిండా వజ్రాలకాంతులు సూర్యకిరణాల్లాగా గిర్రున తిరుగుతున్నాయి. పడవల్లాంటి కార్లలో తిరుగుతున్నారు తనూ, సుజనా, బాబు... ఎటు చూసినా పని వాళ్లు చేతులు కట్టుకుని నిలబడి సలాం చేస్తున్నారు. 'అరుణాచలం' సినిమాలో రజనీకాంత్ లాగా ముప్పై రోజుల్లో కోట్లు ఖర్చుపెట్టుకోమని ఎవరో బోల్డన్ని డబ్బులిచ్చేసినట్లు, డబ్బంతా మంచినీళ్లలాగా ఖర్చుపెడుతున్నాడు. ఐదువేళ్లకి ఐదు ఉంగరాలు నిండిపోయిన చేతుల్తో, పెద్ద పెద్ద నోట్లు భిక్షగాళ్లకి దానం చేస్తున్నాడు. ఓ చీర కొనిపెట్టటానికి కూడా గింజుకుంటాడని భర్తని పిసినారి అని బాహాటంగానే అనే సుజన ''అయ్యో! డబ్బంతా ఖర్చయిపోతోంది'' అంటూ మొత్తుకుంటోంది. ఆమెని చూసి చిద్విలాసంగా నవ్వుతున్నాడు బుచ్చిబాబు.

ఈ లోపల నడుం కింద చల్లగా తగలసాగింది కట్టుకున్న లుంగీ.

మెలకువొచ్చి చూసుకుంటే ఏడాది వయసున్న నానిగాడు చేసిన నిర్వాకం అది.

''సుజనా.. వీడ్ని నా పక్కన పడుకోబెట్టావ్.. ఛ! ఛ! బంగారం లాంటి కల పాడైపోయింది'' విసుక్కుంటూ బట్టలు మార్చుకుని వచ్చి పడుకున్నాడు.

ఎంత మంచి కల.. ఇంకా ముందుకి వెళితే ఇంకెంత బాగుండేదో... ప్చ్! 'అమృతమయి' సంస్థ వాళ్లవి నిజంగా అమృతహస్తాలే అనుకు



న్నాడు.

ఎట్టకేలకు ఆ వజ్రపుతునక బుచ్చిబాబుకి శుభ శకునాలను చూపించింది.

మర్నాడు వెళ్ళి ఉంగరానికి ఆర్డరిచ్చి వచ్చాడు.

ఉంగరం డెలివరీ తీస్కోటానికి వెళ్ళినప్పుడు మళ్ళీ అదే జ్యోతిష్కుడు కలిశాడు బుచ్చిబాబుని.

ఆడపిల్లను అత్తవారింటికి సాగనంపుతున్నట్లు బోల్డన్ని జాగ్రత్తలు చెప్పాడు ఆయన.

''ఇకనుంచీ ఇది మీ దైవం... ఒట్టి ఉంగరమే కదా అనుకుని నిర్లక్ష్యం చెయ్యకండి. రోజుకొక పదినిమిషాలైనా మీ వజ్రంతో మీరు మాట్లాడాలి. దీనితో మీరు ఫ్రెండ్షిప్ చేయండి. ఓ ఫ్రెండ్‌కు చెప్పుకున్నట్లు మీ కష్టసుఖాలు దీనితో చెప్పుకోండి. ఏదైనా అనుకోని లాభాల వర్షం కురిసినప్పుడు అంతా నీ దయ అంటూ దానికి కృతజ్ఞతలు వెలిబుచ్చండి. ఇక అప్పుడు చూడండి, మీ జీవితం ఎలా మారుతుందో'' గట్టి విశ్వాసంతో ఆయన చెబుతుంటే ఒక్కో మాటా శ్రద్ధగా ఆలకించాడు బుచ్చిబాబు.

ఉంగరం వచ్చిన దగ్గర్నుంచీ సుజనకు పని పెరిగిపోయింది. బుచ్చిబాబుకు ఎక్కడలేని డౌట్లు వస్తున్నాయి. తలకు నూనె రాసుకోవాలన్నా, షాంపూ చేసుకోవాలన్నా ఉంగరం పాడైపోతుంది. రాయిలోకి కెమికల్స్ చేరతాయి అంటూ, సుజననే పిలవసాగాడు.


మరో రెండ్రోజులకు బుచ్చిబాబు ఆ ఉంగరాన్ని ధరించి పదే పదే దాన్ని నిమరటం, టీ బ్రేకులో, లంచి బ్రేకులో దానితో మాట్లాడటం గమనించారు కొలీగ్స్ అంతా. విషయం ఏంటో కనుక్కొని పార్టీ ఇవ్వాల్సిందేనని చుట్టుముట్టారు.

మరి కాసేపటికి మేనేజరు లోపలికి పిలిచాడు బుచ్చిబాబుని.

''ఏమయ్యా! ట్యాలీ చెయ్యటంలో మిస్టేక్స్ వచ్చాయి చూడు. ఎంతసేపూ ఆ చేతిని చూస్కుని మురిసిపోవటమే కానీ, పని సరిగ్గా చేద్దామని లేదా?'' కోపంగా పేపర్స్ ముందుకు తోశాడు.

'తనకి లేదని అసూయ' ఉంగరాన్ని మరో చేత్తో ఇష్టంగా తాకుతూ, ఫైల్ తీస్కుని బయటికి వచ్చాడు.

బుచ్చిబాబు ఇంటికొచ్చేటప్పటికి సుజన దగ్గర నిలబడి ఏడుస్తూ ఏదో చెప్తోంది పనిమనిషి లక్ష్మి. ఆ ఇంటికి రెండు ఫర్లాంగుల దూరంలో వుండే స్లమ్ ఏరియాలో వుంటోంది లక్ష్మి కుటుంబం. అక్కడే వుండే




ఇళ్లల్లో పాచిపని చేస్కుంటూ కొడుకుని చదివిస్తోంది. లక్ష్మి మొగుడు నాలుగేళ్ళక్రితమే ఓ ప్రమాదంలో చనిపోయాడు. తిండికి గడవటానికి కష్టమైనా తన రెక్కల కష్టంతో కొడుకుని చదివించటం మాత్రం ఆపలేదు.

ఐదేళ్లుగా బుచ్చిబాబు ఇంట్లో నమ్మకంగా పనిచేస్తోంది. రెండుమూడుసార్లు ఉతుక్కివేసిన బట్టల్లోంచి ''అయ్యగారు మర్చిపోయారమ్మా'' అంటూ తడిసిన వందనోట్లు తెచ్చి సుజనకు ఇచ్చింది. నిజాయితీగా కష్టపడి పనిచేస్తుందని లక్ష్మి అంటే సుజన కూడా అభిమానం చూపిస్తుంది.

''ఏమిటి విషయం?'' లోపలికొస్తూ అడిగాడు బుచ్చిబాబు.

''పిల్లవాడి ఫీజు కట్టాలి బాబూ.. ఓ రెండొందలుంటే సర్దుతారని..'' నసిగింది లక్ష్మి.

అంతే.. లక్ష్మి మీద గయ్యిన లేచాడు బుచ్చిబాబు.

''మొన్ననే కదా.. ఫస్ట్ తారీఖని తీసుకున్నావ్.. అంతలోనే మళ్ళీ డబ్బులంటే ఎలా? అయినా పొద్దస్తమానూ మమ్మల్నే అడుగుతావేం? ఇంకా నాలుగిళ్లల్లో చేస్తున్నావుగా. వాళ్ళని పోయి అడుగు. చదువులంట, చదువులు.. పాచిపని చేస్కునే మొహాలకు స్కూళ్లెందుకు? ఏ పనికో పంపితే నీ కొడుక్కి డబ్బులొస్తాయిగా..'' మేనేజరు తిట్టిన కోపమంతా లక్ష్మి మీద చూపిస్తూ లోపలికి వెళ్ళాడు.

''అది కాదండీ.. పాపం.. ఏదో కష్టంలో వుంది'' సుజన అతని వెనకాలే నడిచొస్తూ చెప్పింది.

''ఏంటి పాపం? ఆ...? అసలు నీనుంచే అది నెత్తికెక్కి కూర్చుంది. పాచిపని చేస్కునే దాని కొడుక్కి చదివించాలనే ఆశ ఎందుకు? ఎంటట? పని మానేస్తుందా? మానెయ్యమను..'' తిక్కతిక్కగా అరిచాడు సుజన మీద.

''అది కాదయ్యా.. నెలకో పది రూపాయలు బిగపట్టుకోండి జీతం డబ్బుల్లో..'' అభిమానం చంపుకుంటూ మెత్తగా అడిగింది లక్ష్మి.

''అవునవును. ఇక నెలనెలా నీ జీతం డబ్బులు లెక్కలేస్కోవటమే మా పని. వెళ్ళు.. వెళ్ళు.. సుజనా.. స్నానానికి వేణ్ణీళ్ళు పెట్టు.. అర్జంటుగా బయటికెళ్ళాలి..'' గబగబా మాట్లాడుతూ బాత్రూమ్ వైపు దారి తీశాడు.

బాత్రూమ్‌కి వెళ్ళాలంటే కిచెన్ దాటుకునే వెళ్ళాలి. వెళ్ళేవాడల్లా ఆగి, వంటగది షెల్ఫ్‌లో చేతికున్న ఉంగరం తీసి పెట్టాడు, తడిసిపోతుందని.

అతను స్నానం చేసి వచ్చేసరికి లక్ష్మి వంటగదిలో నీళ్లబిందెలు దింపుతోంది.

''సుజనా..'' పిలుస్తూ లోపలికొచ్చాడు.

''మేడ పైన బట్టలు తేవటానికి వెళ్ళారు'' చెప్పింది లక్ష్మి.

తనే బట్టలు తీస్కుని డ్రెస్సప్ అయ్యి హడావిడిగా వెళ్ళిపోయాడు.

ఈ హడావిడిలో వంటగది షెల్ఫ్‌లో పెట్టిన ఉంగరం సంగతి మర్చిపోయాడు.

నీళ్లబిందెలు గట్టుమీద దింపుతున్న లక్ష్మి కళ్లు మిలమిలా మెరుస్తున్న ఉంగరం మీద పడ్డాయి.

దాని విలువ నలభై వేల పై మాటేనని బుచ్చిబాబు ఎవరితోనో ఫోన్‌లో చెప్తుంటే విన్నది లక్ష్మి.

ఉదయం నుంచీ ఐదిళ్ళల్లో రెండొందలు ఎక్స్ట్రా కావాలని అడుగుతూ వస్తోంది లక్ష్మి. ఎవరూ ఇవ్వలేదు. పైపెచ్చు పాచిపని చేస్కునే దాని కొడుక్కి చదువెందుకు అని బుచ్చిబాబు అరిచిన కేకలకు దాని కడుపులో రగిలిపోతోంది.

నీళ్లకేనా ఆశలు...? తమకుండకూడదా...? అని అనుకున్న మరుక్షణం దాని చెయ్యి ఉంగరాన్ని తాకింది.

వాకిట్లోనే బట్టలన్నీ భుజాన వేస్కొని సుజన ఎదురైంది. ''వస్తానమ్మా..! నీళ్ల దింపాను'' అని చెప్తూ వెళ్ళిపోయింది.

ఆ రాత్రి ఇంటికొచ్చి పడుకున్న బుచ్చిబాబు అర్ధరాత్రి పన్నెండయ్యేసరికి ఎవరో లాగిపెట్టి తన్నినట్లు ఉలిక్కిపడి లేచాడు.

సుజనా, బాబూ.. పక్కనే పడుకుని ప్రశాంతంగా నిద్రపోతున్నారు. ఉంగరం సంగతి గుర్తొచ్చి వంటగదిలోకి నడిచాడు.

మరో అయిదు నిమిషాలకు వంటగదిలో వున్న సామానంతా చిందర వందర అయ్యింది కానీ, ఉంగరం దొరకలేదు.

ఆ శబ్దాలకు సుజన లేచి వచ్చింది. ఆమె వచ్చేటప్పటికే శనగపిండి, బియ్య ప్పిండి కలిసి గాల్లోకి దుమ్ములా లేచిపో యింది. ఆవాలు, ఇడ్లీరవ్వతో కలిసి నేలంతా పాకుతున్నాయి. విషయమే మిటో తెలుసుకున్న సుజన తనూ వెతి కింది.

''ఇక్కడే పెట్టాను... ఇక్కడే పెట్టాను'' షెల్ఫ్ వైపు చూపిస్తూ పది మార్లు గొణగసాగాడు బుచ్చిబాబు.

అతని పరిస్థితికి జాలిపడిన సుజన ''మీరు వెళ్ళిపడుకోండి. నేను మరో మారు వెతికొస్తాను'' అంటూ చెప్పింది.

మర్నాడు ఉంగరం పోయిందని తెలిసి స్టాఫ్ అంతా సానుభూతి వెలిబుచ్చారు.

''అంజనం వేయిద్దాం రండి'' అంటూ కొలీగ్ పరమేశం లంచ్‌బ్రేక్‌లో ఎక్కడికో తీస్కె ళ్ళాడు. చిన్న ఇరుకు గదిలో వేపమండలు పట్టు కుని, ఒంటినిండా విభూతి బొట్లు, నుదుటన పెద్ద కుంకుమ బొట్టుతో చూడటానికి భయం గొలిపేలా వున్నాడు ఒకతను.

వీళ్ళిద్దరూ ఎదురుగా కూర్చోగానే పక్కనే వున్న హుండీ వైపు చూపించాడు.

''డబ్బులు..'' పరమేశం బుచ్చిబాబు చెవిలో గొణిగాడు.

ఓ రెండొందలు తీసి దాన్లో వేశాడు. అతను తీక్షణంగా తనవైపే చూస్తున్నట్లుగా అనిపించ టంతో మరో వంద హుండీకి సమర్పించుకు న్నాడు.

దానితో ప్రసన్నుడయినట్లు.. అతనేవో నేల మీద గీతలు గీసి.. చేత్తో కాసేపు గవ్వలాట ఆడు కుని..కళ్ళు మూసి తెరుస్తూ.. చివరికి నోరు విప్పాడు.

''వస్తువు చెయ్యిమారింది. అదిప్పుడు మీద గ్గర లేదు. మీకు కావలసినవాళ్ళే తీశారు. మూడు రోజుల్లో దొరికితే దొరికినట్లు, లేనట్లయితే మీరు ఆశ వదిలేసుకోవాల్సిందే'' అంటూ చెప్పాడు.

చిక్కడు, దొరకడు టైపులో సమాధానం చాలా తెలివిగా చెప్పాడు. ''హు.. మూడొందలు క్షవరం'' బయటికొస్తూ పరమేశంతో అన్నాడు బుచ్చిబాబు.

ఇంటికొచ్చాక ప్రశాంతంగా మెదడులోని జ్ఞాపకాల రీలు వెనక్కి తిప్పుతూ కూర్చున్నాడు బుచ్చిబాబు. ఆరోజు.. వంటగదిలో నీళ్లబిం దెలు దింపుతున్న లక్ష్మి కనిపించింది.

''దొరికింది..'' గట్టిగా అరిచాడు. ఆ అరు పునకు సుజన ఉలిక్కిపడితే, నానిగాడు ఏడుపం దుకున్నాడు.




''అవును.. ఖచ్చితంగా లక్ష్మే తీసింది'' దొంగ దొరికినంత సంబరంగా మరోసారి చెప్పాడు.

''అది మనదగ్గర ఎన్నేళ్లుగా పనిచేస్తుంది? దానికి ఆ పాడుబుద్ధి లేదు'' సుజన గట్టిగా వాదిం చింది.

''బాబ్బాబూ... ఒక్కసారి అడగవే'' బ్రతి మాలాడు.

''అడిగితే తెచ్చిస్తుందా? నన్నంటారా- అంటూ భోరుమని ఏడుస్తుంది. రేపట్నించి పని కూడా మానేస్తుంది. అసలే ఈ ఏరియాలో మంచి పనిమనుషులు దొరకరు''

''ఓసి నా భార్యామణీ! నా ఉంగరం కన్నా నీ పనిమనిషే ఎక్కువా? అసలెందుకు? రేపు పోలీస్ కంప్లయింట్ ఇచ్చి దాన్ని కటకటాల వెనక్కి తోయిస్తా'' ఆవేశంగా అన్నాడు.

''ఆ పనికి మళ్ళీ ఎంత ఖర్చుపెట్టాలో.. ఈ ఉంగరానికి లెక్క చూపించమంటూ ఎవరో వచ్చి పడతారు. మా పిల్లని దొంగంటారా అంటూ ఆ స్లమ్ ఏరియావాళ్లంతా చేటలు, రోకలిబండలు, తపేళాలు తీస్కుని మన ఇంటి మీద పడతారు'' సుజన అతనికి భవిష్యత్ చెప్పి భయపెట్టింది.

నిజమే... తమకన్నా లక్ష్మికే బలగం ఎక్కువ.

మరో అయిదు నిమిషాలకి బుచ్చిబాబు మెద డులో ఓ ప్లాన్ రూపుదిద్దుకుంది. సుజనను దగ్గ రకు పిలిచి తన ప్లానేంటో చెప్పాడు.

మర్నాడు పనిలోకి వస్తూనే ''ఉంగరం దొరి కిందామ్మా..?'' అంటూ అడిగింది లక్ష్మి.

''లేదే.. పాపం ఆయన చాలా దిగులు పడు తున్నాడు. అన్నట్లు మొన్న ఏదో పని విసుగులో నిన్ను అరిచేశారట. ఇవిగో రెండొందలు. తీస్కెళ్ళి మీ అబ్బాయి ఫీజు కట్టమని ఇచ్చారు'' అంటూ దాని మనసు మెత్తబడేట్లుగా మాట్లాడి ఇచ్చింది సుజన.

పని ముగించుకుని వెళుతుంటే ''లక్ష్మీ! మధ్యాహ్నం పనులన్నీ ముగించుకుని ఒకసారి రావే. ఇద్దరం కలిసి వంటగదిలో మరో సారి వెతుకుదాం. ఎవరో చెప్పారుట. మీ ఇంట్లోనే వుందీ, స్థలం మారిందీ అని. అదీ కాకుండా ఎల్లుండి మీ మైసమ్మ జాతర వుంది కదా.. అక్కడ తను కూడా నిప్పులగుండం మీద నడిచి ఆ దేవతని వేడుకుంటారట ఆయన'' అంటూ చెప్పింది సుజన.

మైసమ్మ జాతర అనగానే లక్ష్మి గుండె జారిపోయింది. మహా స్వచ్ఛ మైన తల్లి మైసమ్మ అని వాళ్ల విశ్వాసం. తిన్నా, తినకపోయినా, తమకున్నా లేకున్నా ఏడాదికో మారు జాతర చేయటం ఆపరు ఆ ఏరియావాళ్లు. ఆ తల్లికి కోపం వస్తే తట్టుకోలేమని వాళ్ల విశ్వాసం.

''సరేనమ్మా! వస్తాను'' గబగబా అనేసి వెళ్ళి పోయింది లక్ష్మి.

మధ్యాహ్నం ఇద్దరూ కలిసి వంటగది క్లీన్ చేస్తుండగా.. ఏదో పనున్నట్లు ఓ రెండ్నిమిషాలు బయటికి వచ్చి వెళ్ళింది సుజన.

''ఈ స్టౌ దగ్గర చూశారామ్మా మీరు?'' అడుగుతూ గిన్నెలు జరిపింది లక్ష్మి.

కాంతులీనుతూ కనిపించింది డైమండ్ రింగ్. తను అలా వెళ్ళి ఇలా వచ్చేలోపు లక్ష్మి ఉంగరం పెట్టేస్తుందని ఎక్స్‌పెక్ట్ చేసిన సుజన సంతోషపడింది.

ఆ రాత్రి భార్య భుజం మీద చెయ్యేసి గర్వంగా చెప్పాడు బుచ్చిబాబు. ''చూశావా... తేలు కుట్టిన దొంగలాగా ఎలా దొరికిపోయిందో లక్ష్మి? అర్థమైందా? నా తెలివితేటల కెపాసిటీ ఏంటో? కర్ర విరక్కుండా, పాము చావకుండా, ముళ్ళకంచె మీదున్న గుడ్డను ఎలా నేర్పుగా తప్పించానో చూసి నేర్చుకోవోయ్..''

''పెద్దగొప్పేలెండి.. మీ అదృష్టం బాగుండి చేజారిన వస్తువు మళ్ళీ దొరికింది. స్వతహాగా అది మంచిదే. ఆరోజు మీ పీనాసితనంతో దాని మీద అరిచి, ఉంగరాన్ని దాని కళ్ళబడేలా చేసి దానికి ఆ దుర్బుద్ధి పుట్టించారు. ఈరోజు దాని మంచితనం, దైవభక్తి మీకు ఉంగరం దొరికేలా చేశాయి. చావుతప్పి కన్ను లొట్టపోయింది... మీకే...'' రిటార్ట్ ఇచ్చిన సుజన, నిద్దట్లో నాని గాడు కెవ్వుమనటంతో అటువైపు తిరిగింది.

''హు... తెలివిగల పురుషుల్ని ఈ నారీ లోకం ఎప్పుడు గుర్తించింది కనుక?'' తెల్లబో యిన మోముతో విరక్తిగా అనుకోవటం బుచ్చి బాబు వంతైంది.

☆